

పంపుహౌస్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలకు తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి, రామ తీర్థాలు, నెల్లిమర్ల మాస్టర్ పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కీ సిస్టం రద్దు చేసి ఆప్కాస్‌లో చేర్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థ పోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసిందని, నగరపాలక సంస్థ పాలకవర్గం, సంబంధిత అధికారులు పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కీ సిస్టమ్ రద్దు చేయకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న పంప్ హౌస్ కార్మికులకు మాత్రం కేవలం రూ.9వేలు నుంచి 12000 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని అన్నారు. పంప్ హౌస్ కార్మికులందరినీ కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలని కమిషనర్‌ను కోరారు.

నెరవేరని తోటపల్లి లక్ష్యం



- 58,757 ఎకరాలకు అందని సాగునీరు
- పరిహారం, పునరావాసమూ అంతంతమాత్రమే
- నేడు ప్రాజెక్టును పరిశీలించనున్న టిడిపి అధినేత చంద్రబాబు



ఎంతో మంది రైతులు కలలుగన్న తోటపల్లి లక్ష్యం దాదాపు 20ఏళ్లు కావస్తున్నా నెరవేరలేదు. పాలకులు పరస్పర విమర్శలు చేసుకోవడం మినహా ప్రాజెక్టును పూర్తిచేయలేదు. ఫలితంగా లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందడం లేదు. ముఖ్యంగా శివారు ఆయుకట్టుకు నీరు అందడం లేదు. గజపతినగరం బ్రాంచి కెనాల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రాజక్టు కోసం పుట్టిపెరిగిన ఊళ్లు, తాతతండ్రుల నుంచి వచ్చిన పొలాలు త్యాగం చేసిన నిర్వాసితులకూ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదు. ఇప్పటికీ చాలా మంది నిర్వాసితులు ప్రభుత్వ సాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతునే ఉన్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తోటపల్లి ప్రాజెక్టు స్వాతంత్రానికి పూర్వం నుంచీ ఉంది. అప్పట్లో సుమారు 64 వేల ఎకరాల సాగునీటిని అందించేది. ఈ ఆయుకట్టును స్థిరీకరిస్తూనే పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో సర్ధార్ గౌతులచ్చన్న తోటపల్లి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో తమకు పునరావాసం, ప్యాకేజీ కల్పించిన తరువాతే నిర్మాణ పనులు చేపట్టాలంటూ సిపిఎం ఆధ్వర్యాన నిర్వాసితులు పోరాడిన విషయం విధితమే. ఈ క్రమంలో రైతులపై పోలీసుల లాఠీఛార్జి, విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతోపాటు రైతులను, సిపిఎం నాయకులను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు కూడా పంపారు. ఇప్పటికీ ఆ సంఘటన ఈ ప్రాంతవాసులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఇటువంటి ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయడం లోనూ, నిర్వాసితులకు న్యాయం చేయడంలోనూ పాలకులు విఫలమయ్యారు.

ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.891 కోట్లు ఖర్చు చేశారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే... అధికారిక లెక్కల ప్రకారం 2019-20 బడ్జెట్‌లో రూ.156 కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57 కోట్ల కేటాయించగా రూ.37.27 కోట్లు చెల్లించింది. 2021-22లో 189.70 కోట్లకు గాను రూ.135 కోట్లే ఇచ్చింది. 2022-23లో రూ.126.61 కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మరోవైపు సుమారు రూ.6.37 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు.

ఇంకా పిల్లకాలువలు, మదుములు, స్ట్రక్చర్లు, లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. 291.48 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. వీటన్నింటికీ ప్రాజెక్టు అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపగా మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం రూ.80.84 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో పెండింగ్ పనులకు రూ.73.13 కోట్లు, భూమి కొనుగోలుకు రూ.3.75 కోట్లు, ఆర్అండ్ఆర్‌కు రూ.3.96 కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో కేటాయింపుల తగ్గింపు మరింత విస్మయానికి గురిచేసింది. పెండింగ్ పనుల వల్ల 58,757 ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామి నాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్ వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళు నిర్మించుకో లేక పోయారు. ఈనేపథ్యంలో అర్అండ్ఆర్ కింద రూ.119.1 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8 కోట్లు అవసరం కానుంది. ఆర్అండ్ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడల తోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. చట్ట ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం, నిర్వాసిత పోరాట కమిటీల ఆధ్వర్యాన నిర్వాసితులు మరో పోరాటానికి సిద్ధమౌతున్నారు.

తోటపల్లి ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు

ఆర్థిక సంవత్సరం	కేటాయింపులు	విడుదల
2019-20	రూ.156 కోట్లు	రూ.13.64కోట్లు
2020-21	రూ.225.57కోట్లు	రూ.37.27కోట్లు
2021-22	రూ.199.70కోట్లు	రూ.1.35కోట్లు
2022-23	రూ.126.61కోట్లు	రూ.4.26
2023-24	రూ.80.84కోట్లు	రూ.????



కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేస్తున్న విఆర్ఎలు

విఆర్ఎలకు న్యాయం చేయాలి

ముగిసిన 36గంటల నిరసన దీక్షలు ● కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద చేపట్టిన 36గంటల నిరసన దీక్షలు మంగళవారం ముగిశాయి. రెండోరోజు నిరసనలో భాగంగా కలెక్టరేట్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని తెలిపారు. డిఎ రూ.300 వేతనంతో కలిపి పూర్తిగా ఇవ్వాలని,వేతనం రూ.26వేలకు పెంచాలని, విఆర్ఎల నుండి డిఎ తిరిగి చెల్లించాలనే నిబంధనను తొలగించి, ఇప్పటికే వసూలు చేసిన మొత్తాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. రికవరీ జీవోను ఉపసంహరించాలన్నారు. కరోనా సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వేతనం 2 నెలలకు రూ.2వేలు కోత విధించారని, ఆ మొత్తాన్ని అన్ని జిల్లాల్లోనూ ఇచ్చేసినా, విజయనగరం జిల్లాలో మాత్రం తిరిగి ఇవ్వలేదని అన్నారు. రికవరీ జిఓను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ అటెండర్, వాచ్‌మెన్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, కార్యదర్శి జి.వెంకన్న, రాంబాబు, బద్రీ, చంద్రరావు, భవాని, రూప, ఆదినారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని రావువారివీధి, భూములవీధి, గౌడవీధి, మంగళవీధిలో పారిశుధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికుల పని విధానంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు నిర్వహణపై ఆరా తీశారు. ఆయనతో పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-శృంగవరపుకోట, కొత్తవలస, గంట్యాడ

రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో రాళ్ల పాతే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, గంట్యాడ మండలాల్లో ఆయన మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను, స్టోన్ ప్లాంటేషన్ ను, కొత్త జాతీయ రహదారి 516 బి ప్రతిపాదిత గ్రామాలను సందర్శించారు. కొత్తవలస మండలం కంటకాపల్లిలో స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. నిర్ధేశిత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తెలుసుకున్నారు. కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట మండలాల మీదుగా ప్రతిపాదిత 516 బి కొత్త జాతీయ రహదారి సాగే గ్రామాలను, రహదారి మార్గాన్ని ఆయన పరిశీలించారు. ఎస్.కోట మండలం సీతంపేట గ్రామం వద్ద నిర్మించనున్న బైపాస్ బ్రిడ్జి స్థలాన్ని కూడా సందర్శించారు. అనంతరం గంట్యాడ మండలంలో పర్యటించారు. 516 ఇ జాతీయ రహదారి కారణంగా నష్టపోయిన గ్రామాలను సందర్శించారు. మధుపాడ రోడ్డును పునరుద్దరించా లని, కొండతామరాపల్లి బాపనబంద ఛానల్స్ బాగుచేసి, నీరు వెళ్లే అవకాశాన్ని కల్పించాలని, జాతీయ రహదారుల అథారిటీ ఇంజినీర్లను, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. పర్యటనలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఎస్.కోట తాహశీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎల్.కోట తాహశీల్దార్ ఆదిబాబు, గంట్యాడ తాహశీల్దార్ స్వర్ణకుమార్, ఆయా మండలాల డిటిలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జికలెక్టర్ అశోక్, ఆర్‌డిఒ సూర్యకళ

తాటిపూడి గురుకులంలో ఫుడ్ కమిషన్ సభ్యుల తనిఖీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు మంగళవారం తాటిపూడి వద్దగల ఎపి గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. వసతి గృహాల వద్ద పరిశుభ్రత లేకపోవడం, విద్యార్థులు నిద్రించే గదులలోవిద్యుత్ సదుపాయం లేకపోవడం, ఫ్యాన్లు పనిచేయకపోవడాన్ని గుర్తించారు. కొత్తగా ఇంఛార్జి బాధ్యతలు తీసుకున్న ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. మళ్లీ ఒకసారి తనిఖీకి వచ్చేసరికి పూర్తిస్థాయిలో పిల్లలందరికీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పక్కనే ఉన్న ఎపి రెసిడెన్షియల్ కాలేజి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజన, వసతి గురించి ఆరా తీశారు. బాగా చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.



పాఠశాలలో వ్యర్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు

ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్రకు ఘన స్వాగతం

- నేడు విద్యార్థుల మహాప్రదర్శన... బహిరంగసభ
- ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మయూక్ బిశ్వాస్ రాక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మంగళవారం విజయనగరం పట్టణానికి చేరుకుంది. గతనెల 31న కొత్తవలసలో ప్రారంభమైన ఈ యాత్ర 19 మండలాల మీదుగా విజయనగరం చేరుకుంది. సుమారు 400 కిలోమీటర్లు సాగిన ఈ సైకిల్‌యాత్రలో సంక్షేమ వసతి గృహాలను, పలు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను ఎస్ఎఫ్ఐ నాయకులు అడిగి తెలుసుకున్నారు. విజయనగరం చేరుకున్న నాయకులకు కోట జంక్షన్ వద్ద సిఐటియు, ఐద్వా, రైతు ,వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎస్ఎఫ్ఐ నాయకులపై పూలు వర్షం కురిపించి తిలకం దిద్దారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రుద్ర ప్రసాదు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ సుధారాణి, సిఐటియు నగర కార్యదర్శి బి రమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి. పైడిరాజు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను మాట్లాడారు. విద్యారంగాన్ని కార్పొరేట్, మతతత్వ శక్తుల నుంచి కాపాడుకునేందుకు ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్ పోరాటాలకు అండగా నిలుస్తామని ప్రకటించారు. ఐద్వా సహాయ కార్యదర్శి లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్ పాల్గొన్నారు.



కోటజంక్షన్ వద్ద ఎస్ఎఫ్ఐ సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

డెంకాడ : మండల కేంద్రంలోని పాఠశాలలను, కళాశాలను ఎస్ఎఫ్క్ష్మి నాయకులు పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం పక్కనే ఉన్న డెంకాడ మండలం విద్యారంగ అభివృద్ధిలో మాత్రం దూరంగా ఉందన్నారు. హైస్కూలు మౌలిక వసతులు లేక కొట్టుమిట్టాడుతోందని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదుల కొరత, ప్రహరీ గోడ కూడా లేకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. కళాశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని , మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యార్థి మహా ప్రదర్శన, భారీ బహిరంగ సభ

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన సైకిల్‌యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం నగరంలో విద్యార్థుల మహాప్రదర్శన, బాలాజీ జంక్షన్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి ప్రదర్శన ప్రారంభమై బాలాజీ జంక్షన్ వరకు కొనసాగుతుందన్నారు. గతనెల 31న చేపట్టిన సైకిల్‌యాత్ర బుధవారం ముగియనుందన్నారు. పదిరోజులు పాటు ఎస్ఎఫ్ఐ బృందం విద్యార్థులందరినీ కలుస్తూ, వసతి గృహాలను పరిశీలిస్తూ సమస్యలను గుర్తించిందని, వాటిని జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేస్తుందని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. బహిరంగ సభకు ఎస్ఎఫ్ఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మయూక్ బిస్వాస్ హాజరవుతారని తెలిపారు. విద్యార్థులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.



అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

12న ఉపాధ్యాయుల నిరసన : ఫ్యాప్టో

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 12న తలపెట్టిన 12గంటల ధర్నాను జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎపిటిఎఫ్ (257) కార్యాలయంలో ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరమణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు 12గంటల పాటు కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి మార్చుకోవాలని, పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, జూన్ లో బదిలీ, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల జీతాలను వెంటనే చెల్లించాలని, అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల వర్కు లోడును తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు డి.ఈశ్వరరావు (ఎపిటిఎఫ్ 1938), జె. రమేష్ చంద్ర పట్నాయిక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు (యుటిఎఫ్), షేక్‌బుకారిబాబు, పి.శ్రీనివాస్ (ఎపిటిఎఫ్) డి.శామ్ (ఎస్‌టియు) తదితరులు పాల్గొన్నారు.

జలయజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చేశారు

టిడిపి నాయకులు అశోక్, బుద్దా వెంకన్న

ప్రజాశక్తి- విజయనగరం కోట

రాష్ట్రంలోని వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత జల యజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చేసిందని టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. మంగళవారం ఈమేరకు అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చంద్రబాబు పర్యటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మంగళవారం రాత్రికే చంద్రబాబు అశోక్‌బంగ్లాకు చేరుకొని బస చేస్తారని తెలిపారు. ఉదయం ఇక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా పార్వతీపురం చేరుకొని తోటపల్లి ప్రాజెక్టును సందర్శిస్తారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత తోటపల్లి ప్రాజెక్టుకు కనీసం మరమ్మత్తులు కూడా చేయలేదన్నారు. ప్రాజెక్టు సందర్శన అనంతరం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులు, నాయకులతో ముఖాముఖి మాట్లాడుతారని అన్నారు. తరువాత పార్వతీపురంలో రోడ్డుషో, పాత బస్టాండ్ వద్ద బహిరంగసభలో పాల్గొంటారని వివరించారు. రాత్రికి పార్వతీపురంలో బస చేసి గురువారం ఉదయం 10గంటలకు పాలకొండలో వంశధార ప్రాజెక్ట్ సందర్శన చేసి శ్రీకాకుళం పర్యటనకు వెళ్తారని తెలిపారు.


బుద్దా వెంకన్న మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో కొడాలి నాని పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని, గంజాయి తాగి చంద్రబాబును విమర్శిస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టును 78 శాతం పూర్తి చేసిన చరిత్ర చంద్రబాబుదని, జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చిన చరిత్ర వైసిపి ప్రభుత్వానిదని అన్నారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకే పుంగనూరులో వైసిపి దాడులు చేయించిందన్నారు. ప్రజలముందుకు వచ్చి వైసిపినాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును ఎవరైనా అడ్డుకుంటే తాము ప్రతిఘటిస్తామన్నారు. సమావేశంలో విజయ నగరం పార్లమెంట్‌స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు , వేచలపు శ్రీనివాసరావు,కనకాల మురళీమోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పేదలకు శాశ్వత యాజమాన్య హక్కులు

- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పేదలకు హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - జామి

సామిత్వ కార్యక్రమం ద్వారా గ్రామ కంఠాలకు శాశ్వత యాజమాన్య హక్కులు లభిస్తాయని, ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ ఇటువంటి గొప్ప కార్యక్రమం చేసిన ఘనత ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యపడిందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని శిరికిపాలెం గ్రామంలో ప్రజలకు ఆస్తి కార్డులను పంపిణీ చేసే 'స్వామిత్వ' పథకం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఖరీఫ్ ప్రణాళిక 2023-24 నవధాన్యాల సాగు - నేలతల్లికి బాగు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు నవదాన్యాలు, చిరుదాన్యాల కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు తమ ఆస్తులపై శాశ్వత ఆధీనం కల్పించే ప్రధాన ఉద్దేశ్యంతో సామిత్వ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తి హక్కుల గురించి నివాసితులకు తెలియజేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాలను అమలు చేసి గ్రామాల్లోని ప్రజల ఆస్తి తగాదాలకు స్వస్తి పలుకుతుం దన్నారు. ఇది గ్రామీణ ప్రజల పట్ల ప్రభుతానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం శిరికిపాలేం గ్రామానికి జెడ్‌పి నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వడానికి తాను ముందుండి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రాఘురాజు మాట్లాడుతూ, ప్రజల పక్షాన పని చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. అనంతరం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి కన్వీనర్ గొర్లె రవికుమార్, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ ఎంపిపి సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, డిసిసిబి డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, డిపిఒ శ్రీధర్ రాజా, డిఎల్‌డిఒ నిర్మలాదేవి, తహాశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ సతీష్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



భూ హక్కు పత్రాలు అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

వార్డు మెంబర్ ఎన్నికకు నోటిఫికేషన్

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో 7వ వార్డుకు ఎన్నిక కోసం నోటిఫికేషన్ వచ్చిందని ఎంపిడిఒ డిడి స్వరూప రాణి తెలిపారు. మంగళవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను పంచాయతీ కార్యాలయం వద్ద అతికించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఏడవ వార్డు మెంబర్ మృతి చెందడంతో అవార్డుకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న ఎన్నిక ఉంటుందని ఈనెల 10వరకు నామినేషన్ స్వీకరిస్తామని చెప్పారు. ఎన్నిక నిర్వహణ అధికారిగా ఎంఇఒ-2 రాధాకృష్ణ, ఆయనకి సహాయ అధికారిగా జగదీష్‌ను నియమిస్తున్నామన్నారు.

నామినేషన్లు పరిశీలన

వేపాడ: మండలంలో ఖాళీలు ఏర్పడిన పంచాయతీ వార్డు మెంబర్లు ఉప ఎన్నికల నామినేషన్లు ప్రక్రియను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పరిశీలించారు. మంగళవారం బొద్దాం, సింగరాయి, జగ్గయ్యపేట గ్రామ సచివాలయాలను పరిశీలించి నామినేషన్ పత్రాలు సేకరణకు సంబంధించిన సూచనలు సలహాలను సిబ్బందికి ఇచ్చారు. అనంతరం పాటూరు సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో కార్యదర్శి సంధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దిశ యాప్ పై అవగాహన అవసరం

రామభద్రపురం: దిశ యాప్ పై ప్రతి బాలికకు అవగాహన కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపారు. మంగళవారం నాయుడువలస పాఠశాలలో దిశ యాప్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దిశ యాప్ వల్ల బాలికలకు తక్షణ రక్షణ సహాయం పొందవచ్చునన్నారు. లైంగిక వేధింపులు, ప్రమాదాలు, బాలికల అక్రమ రవాణాల నుండి దిశ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చని తెలిపారు. కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ ఇంటా బయట, పాఠశాలలో పనిచేసే స్థలాల్లో ఇబ్బందులు ఏర్పడితే 100 నెంబర్‌కి కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి వేణు, రాజశేఖర్, బొప్పే రవి కుమార్, కృష్ణంనాయుడు, శివ నాయుడు, బాలికలు పాల్గొన్నారు.

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం దత్తి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం ప్రతీ అసెస్మెంట్ అనంతరం విద్యార్థుల ప్రగతిని చర్చించేందుకు ఫార్మేటివ్ పరీక్ష పూర్తి అయినందున తల్లితండ్రుల సమావేశం నిర్వహించామన్నారు. విద్యార్థుల ప్రగతి పత్రాలు తల్లిదండ్రులకు అందజేశామని చెప్పారు. తల్లిదండ్రులందరూ విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరయ్యేలా వారి స్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై టిడిపి ఆర్‌టిఐ

నెల్లిమర్ల : ప్రభుత్వ పథకాల పై టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌టిఐ వేశారు. 2019 నుంచి 2023 వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమాచార హక్కు చట్టం ప్రకారం సంబంధిత రికార్డులు ఇవ్వాలని తహశీల్దార్, ఎంపిడిఒ, నగర పంచాయతీ కమిషనర్‌కి దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా గేదెల రాజారావు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న హౌసింగ్, ఉపాధి హామీ పథకం, అమ్మఒడి, పింఛన్లు, ఆసరా పథకాలు ఎంత మందికి ఇచ్చారు? లబ్ధిదారుల వివరాలు కావాలని కోరుతూ ఆర్‌టిఐ దరఖాస్తు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీనివాస రావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులులేకుండా చూడాలి

నెల్లిమర్ల: విద్యుత్ సమ్మెతో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10నుంచి విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెకు దిగుతున్నట్లు నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం, అధికార్లు చూడాలని కోరారు. ఖరీఫ్ సీజన్ మొదలై రైతులు వరి సాగుకి దిగి దమ్ము, నాట్లు వేస్తున్నారని వారికి విద్యుత్ సమస్యల రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికార్లపై ఉందన్నారు. ఇప్పుడు కూడా అప్రకటిత విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమ్మె వల్ల రైతులకు ఇబ్బంది కలిగితే రైతులతో సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జీవనోపాధిపై మహిళలకు అవగాహన

డెంకాడ: మహిళ జీవనోపాధి, పొదుపు అభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా డిపిఎం ఎల్‌హెచ్ ఎం ఆయుక్త కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు, జీవనోపాధిపై మండల మహిళా సమాఖ్య సభ్యులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యాపారాలతో పాటు జీవనోపాధి, పొదుపు ఎంతో ముఖ్యమని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం ఎన్నో రాయితీలను వ్యాపారాల నిమిత్తం ఇస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ప్రతి మహిళ బాల్యవివాహాలను నిర్మూలించడానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం హెచ్. గీత, ఎసి రాజకుమార్, వైజాగ్ కోఆర్డినేటర్ శివకుమార్, ఎపిఎం విజయలక్ష్మి, సీసీలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

కొత్తవలస: ఈ నెల 12, 13 తేదీల్లో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. చందులూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఎంపిక పోటీలు జరిగాయని జిల్లా ప్రధాన కార్యదర్శి పుటేటి ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయిలో డి. సతీష్, డి.కృష్ణంనాయుడు, కార్తీక్, చందు, రాము, జయరామ్, సుధీర్, కుమార్, పండు, సిద్ధు, వాసు, మనోజ్ ఎంపికయ్యారన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. వి.గోవిందరావు, యు.శ్రీనివాసరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

వేపాడ: మండలంలో కొంపల్లి, ఎస్‌కోటపేట గ్రామాల్లో ఖాళీలైన వాలంటీర్ల పోస్టులకు ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారే అర్హులన్నారు. కనీస ఉత్తీర్ణత పదో తరగతి చదివి ఉండాలని, కొంపల్లిలో బిసి డి పురుషుడు, ఎస్‌కోటపేటలో బిసి డి మహిళలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు 9న పరిశీలించి 10న పరీక్ష ఎంపిక ఉంటుందన్నారు.

కడుపుమంటతోనే కోలగట్లపై విమర్శలు

విజయనగరం టౌన్: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ.. ప్రభుత్వంపైన, తమ నాయకుడు కోలగట్ల వీరభద్ర స్వామిపైన ప్రతిపక్షాలు కడుపుమంటతో ఆరోపణలు చేస్తున్నారని వైసిపి సోషల్ మీడియా విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జి కరకల కృష్ణ అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదంటూ ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారానికి దిగుతున్నారని, వీటిని తిప్పికొట్టేందుకు సోషల్ మీడియా విభాగం సిద్ధంగా ఉందని చెప్పారు. మంగళవారం కోలగట్ల నివాసం వద్ద ఆపార్టీ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదంటూ బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్షాలు నగరంలోని 50 డివిజన్లు, మండలంలోని పంచాయతీలకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నగర ఇన్చార్జి కనిశెట్టి సుధ, మండల ఇన్చార్జి ఆర్.వెంకటేష్, నియోజకవర్గ కో-కన్వీనర్లు అయ్యప్ప అమర, సైలాడ హరిబాబు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంబిసిగా గుర్తించాలి

ప్రజాశక్తి- విజయనగరం


రాష్ట్రంలో తెలికల కులస్తులను అత్యంత వెనుకబడిన కులంగా గుర్తించాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జామి గోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో మంగళవారం శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జ్ఞానమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వాలు బిసిలకు పెద్ద పీట వేస్తున్నామని చెబుతున్నా అమలు కావడం లేదన్నారు.పెద్ద కులాల చేతిలో చిన్న కులాలు అణచివేతకు గురవుతున్నాయని అన్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రం అంతా పర్యటించి అత్యంత వెనుకబడిన కులాల స్థితిగతులను అధ్యయనం చేసి నివేదిక అందించాలని చెప్పిందని, కానీ ఆ నివేదిక నేటికీ బయటకు రాలేదని అన్నారు. తెలికుల కులాన్ని వెనుకబడిన కులంగా గుర్తించి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోడదల విజయ్ కుమార్, వసాది సూరిబాబు, మొయిద రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గజానికో గొయ్యి.. ప్రయాణం కష్టమేనోయి

- అధ్వాన్నంగా గ్రామీణ రహదారులు • పట్టించుకోని పాలకులు • ఇబ్బందులు పడుతున్న 10 గ్రామాల ప్రజలు • కెఆర్‌పేటకు నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామాల్లో రోడ్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉన్నాయి. ఏ రోడ్డు చూసినా గజానికో గొయ్యితో దర్శనమిస్తున్నాయి. చిన్న చినుకు పడినా ఆ గోతుల్లో నీరు చేరి లోతు తెలియక చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడిన సందర్భాల్లో కూడా రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నామని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారిన రోడ్ల పరిస్థితి మారడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డెంకాడ: గోతులమయమైన ఆకులపేట, గంట్లాం రహదారి

మండలంలోని విజయనగరం విశాఖపట్నం జాతీయ రహదారి జొన్నాడ జంక్షన్ నుంచి ఆకులపేట, డి.తాళ్లవలస, గంట్లాం, అక్కివరం వరకు సుమారు పది కిలోమీటర్లు తారురోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ఈ గోతులను గత ప్రభుత్వంలో మరమ్మతులు చేసి వదిలేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లవుతున్నా ఈ రోడ్డుకు మోక్షం కలగలేదు. ఎక్కడికక్కడ గోతులు పడటంతో మట్టి రోడ్డు కంటే అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డులో సుమారు పది గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తూనే ఉంటారు. మండల కాంప్లెక్స్‌కి రావాలన్నా, విజయనగరం వెళ్లాలన్నా ఈ రోడ్డు గుండానే ప్రయాణించాలి. రోడ్డు బాగోకపోవడంతో ఎన్నో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎంతోమంది వికలాంగులుగా తయారవుతున్నారు. వర్షం పడితే ఈ రోడ్లలో ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు. రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు చేరడం వల్ల చెరువులను తలపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పరిస్థితి పై ప్రజాప్రతినిధులకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతనంగా రోడ్డును వేయాలని లేకపోతే ప్రజాప్రతినిధుల ఇంటిముందు ధర్నా నిర్వహిస్తామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

కెఆర్‌పేటకు నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో దేవరాపల్లి వద్ద రైవాడ కల్వర్టు ఉంది. ఈ కల్వర్టు పై నుంచి ఇటీవల రేషన్ సరుకులతో లారీ ప్రయాణించింది. దీంతో ఆ కల్వర్టు ఒక్కసారిగా కూలిపోయింది. కల్వర్టు కూలిపోయి వారం రోజులు కావస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కూలిపోయిన కల్వర్టును బాగుచేసి రాకపోకలు పునరుద్ధరించాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు..

తాత్కాలిక రహదారితో అవస్థలు

ప్రజాశక్తి - వేపాడ

చిరుతపాలెం జంక్షన్, భరతవాని పాలెం గ్రామానికి మధ్య రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి అవసరమగు కల్వర్టు నిర్మాణ పనులు నిమిత్తం తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు వేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా మరోసారి డైవర్షన్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. రోడ్డు సరిగా వేయకపోవడం దంతో వాహనాలు దిగబడిపోతున్నాయి. బడి బస్సులు, వేపాడ నుంచి విశాఖ, గాజువాక వెళ్లే ఆర్‌టిసి బస్సులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిత్యం పాఠశాలలకు ఎస్.కె.ఆర్.పురం, బి.వి.పాలెం, చినరుపిడాప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు కలిసికట్టుగా సింగవరం జంక్షన్ వరకు వచ్చి బడి బస్సు ఎక్కాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి రోడ్డును బాగుచేసి ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



తాత్కాలికంగా వేసిన రహదారి

రాజకీయ లబ్ధికోసమే పుంగనూరు విధ్వంసం

ప్రజాశక్తి- బొబ్బిలి

రాజకీయ లబ్ది కోసమే పుంగనూరులో చంద్రబాబు విధ్వంసం సృష్టించారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు హోదా, వయస్సు మరిచిపోయి అధ్వాన్నంగా, అసహ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. పుంగనూరు పర్యటనలో రూట్ మ్యాప్ ప్రకారం పర్యటన చేయకుండా సంఘ విద్రోహ శక్తులతో విధ్వంసాన్ని సృష్టించారని విమర్శించారు. చంద్రబాబు పర్యటనలో కాల్పులు జరిపితే ఎవరైన మరణిస్తే పోలీసులు, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. పోలీసులు సమన్వయం పాటించడంతో ప్రమాదం తప్పిందన్నారు. చంద్రబాబు ప్రాజెక్టుల పర్యటన పేరుతో విధ్వంసం చేస్తే లోకేష్ యువగళం పాదయాత్రలో ఏమి మాట్లాడుతున్నాడో తెలియదన్నారు. వారాహి యాత్ర పేరుతో పవన్ అసభ్య పదజాలంతో ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను రెచ్చగొట్టి లబ్ది పొందేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. పుంగనూరులో టిడిపి గెలిచే పరిస్థితి లేకపోవడంతోనే ఇలా చౌవుకబారు పనులు చేస్తున్నారన్నారు. కుప్పంలో కూడా చంద్రబాబు గెలిచే పరిస్థితి లేదని జోష్యం పలికారు. బొబ్బిలిలో చంద్రబాబు సభకు పక్క నియోజకవర్గాల నుంచి జనాలను తీసుకువచ్చారన్నారు. పక్క నియోజకవర్గ ప్రజలను చూసి బలం అనుకోవడం సరికాదన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భాషా, ప్రవర్తన మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. బొబ్బిలిలో టిడిపి నేతలు గాలిలో మేడలు కడుతున్నారని, రానున్న ఎన్నికల్లో గాలి మేడలు కూలడం ఖాయమని ఎద్దేవా చేశారు ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణంలోని 16,17 వార్డులలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. హామీలను అమలు చేసేందుకు నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తాన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ చైర్మన్ జి.రమాదేవి, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై కొరడా

బొబ్బిలి: అక్రమ గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మండలంలోని కలవరాయి సమీపంలో సోమవారం రాత్రి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరపడంతో రెవెన్యూ అధికారులు అర్ధరాత్రి దాడి చేసి ఒక జెసిబిను, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ డోల రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రావెల్ తవ్వకాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలన్నారు. అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలు నివారణకు ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. దాడిలో హెచ్‌డిటి జి.గౌరీశంకర్, ఆర్‌ఐ కళ్యాణ్ చక్రవర్తి, విఆర్‌ఒ పాల్గొన్నారు.

కన్వీనర్‌కు సత్కారం

నెల్లిమర్ల: టిడిపి తూర్పు కాపు సంఘం పార్లమెంటు కన్వీనర్ చింతపల్లి రమణ దంపతులను మంగళవారం కళాకారుల సంఘం సత్కరించింది. చనమల్లపేటకు చెందిన శ్రీ వేంకటేశ్వర నాట్య కళా మండలి ప్రతినిధులు చనమల్ల అప్పలనాయుడు, బలివాడ ప్రసాద్ ఈ సత్కారం చేశారు. ఈ సందర్భంగా చింతపల్లి రమణ మాట్లాడుతూ తూర్పు కాపులు ఐక్యంగా ఉండాలని సమస్యలు పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

పొలాల్లో స్టోన్ ప్లాంటేషన్

బొబ్బిలి: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకంలో భాగంగా తహశీల్దార్ ఆధ్వర్యంలో మండలంలోని చిత్రకోట బొడ్డవలస రెవెన్యూ గ్రామంలో భూ సర్వే రాళ్లను మంగళవారం పాతించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అప్పు, గ్రామ రెవెన్యూ అధికారి తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నెల్లిమర్ల: ఎపి ఎన్‌జిఒ 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల గోడ పత్రికను తమ్మాపురంలో మంగళవారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈనెల 21, 22వ తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైసిపి నాయకులు మత్స సత్యనారాయణ, డిసిసిబి వైస్ చైర్మన్ చెనమల్లు వెంకటరమణ, ఎపి ఎన్‌జిఒ నెల్లిమర్ల తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు గణేష్, రమణ, కోశాధికారి ధనుంజయ్, వైస్ ప్రెసిడెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుర్ల

గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎంపిపి పొట్నూరు ప్రమీల అధ్యక్షతన స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇల్లుకు బిల్లులు వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా వ్యవసాయ శాఖ నివేదికను ఎఒ తిరుపతిరావు సభ్యులకు వివరించారు. రెవెన్యూ శాఖ పనితీరు పై కొండగంగ్రేడు, దేవునికనపాక సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల ప్రయివేటు వ్యక్తి ఇల్లు స్థలాలను అమ్ముతున్నారని సభ దృష్టికి తెచ్చారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు రాలేదని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. అంతరం ఐసిడిఎస్, పంచాయితీ రాజ్, విద్య, వైద్య, శాఖల అధికారులు నివేదికలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రమీల మాట్లాడుతూ అధికారులు అందరూ సభ్యులు అడిగిన ప్రశ్నలకు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు, డిఎల్‌డిఎల్ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, ఎంపిడిఒ కల్యాణి, తహశీల్దార్ పద్మావతి,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

వైద్య సేవలపై సంతృప్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక సామాజిక ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు సంతృప్తి చెందుతున్నారని ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో వైద్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలువురు రోగులతో మాట్లాడి వైద్యం అందే తీరుపై ఆరా తీశారు. కొత్తగా నిర్మిస్తున్న 50పడకల ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు కంటే ప్రస్తుతం ఒపి పెరిగిందన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కాశీ విశ్వనాధ్ మాట్లాడుతూ గైనకాలజీ, మత్తు, జనరల్ సర్జెన్ వైద్యులు కావాలని ఎమ్మెల్యేకు కోరారు. వెంటనే ఎమ్మెల్యే డిసిహెచ్‌కి ఫోన్ చేసి వైద్యులని ఏర్పాటు చేయాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగికి తినడానికి మంచి భోజన సదుపాయం కల్పించాలని సూచించారు. 50 పడకల ఆసుపత్రిని త్వరగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పెద్దింటి నాగేశ్వరావు, ఎంపిడిఒ ఆంజినేయులు, శ్రీనివాస్, జెడ్‌పిటిసి రామారావు, ఆసుపత్రి డైరెక్టర్ ఆవు సత్యనారాయణ, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

విజయనగరం : ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో చేయనున్న పంటకోత ప్రయోగాలు, సిసిఇ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక డిఆర్‌సి మీటింగ్ హాలులో మండల వ్యవసాయ, గ్రామ వ్యవసాయ అధికారులకు, ఎఎస్ఒలకు మంగళవారం ప్రత్యేక జిల్లా స్థాయి శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి రామారావు, ఉద్యానశాఖ అధికారి జమదగ్ని, వ్యవసాయశాఖ ఎడి అన్నపూర్ణ మాట్లాడారు. జెడి రామారావు మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటకోత ప్రయోగాలను అత్యంత కచ్చితంగా నిర్వహించాలని, ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. సిసిఇ (క్రాప్ కటింగ్ ఎక్స్పర్మెంట్) యాప్‌ను వినియోగించి వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో నమోదు చేసే వివరాలు పంటలకు, రైతులకు సంబంధించిన వివరాలను కచ్చితంగా తెలుసుకోడానికి, బీమా పథకం వర్తింపులో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్స్‌లో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రానున్న కాలంలో ఎలక్ట్రానిక్స్ చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ వుందని ఎలక్ట్రానిక్స్ డిఫెన్స్ రీసెర్చ్ ఎస్టాబ్లీష్మెంట్ (ఎల్‌ఆర్‌డిఇ) రిటైర్డ్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. రాధాకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 'రాడార్ టెక్నాలజీస్' అనే అంశంపై ప్రసంగించారు. సిఎస్ఇ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ సదస్సును ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ప్రారంభించారు. వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి.కె.మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డీన్ డాక్టర్ సన్నీ డియోల్, పారామెడికల్ డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ఎస్. వర్మ, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం రాధాకృష్ణను ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ఘనంగా సత్కరించారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ఎన్ఆర్ఐ తో సెంచూరియన్ ఎంఒయు

ఎన్ఆర్ఐతో సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఎంఒయు కుదుర్చుకుంది. మంగళవారం ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజుతో ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ మధ్య ఎంఒయు (అవగాహనా ఒప్పందం) కుదిరింది. దీనివల్ల బిఎస్‌సి అనస్తీషియా, రేడియోలజీ చదువుతున్న విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్ చేసుకోవడానికి ఈ ఒప్పందం దోహద పడుతుందన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాకవి గద్దర్ సంస్మరణ సభను తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు ముందుగా గద్దర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గద్దర్ జన నాట్య మండలితో వెలిగిన ప్రజాచైతన్య కంచు కాగడా అన్నారు. గుమ్మడి విఠల్ రావు నుండి గద్దర్‌గా పరిణామం చెందిన ప్రజాకవి గద్దర్ అని కొనియాడారు. తన పాటతో గళమెత్తి, గజ్జతో ఆట కట్టి ఎన్నో విప్లవ గీతాలు ఆలపించారని, 'వీరు లారా వందనం 'పాటని పాడి వినిపించారు. తెలుగు శాఖ విభాగాధిపతి రేచర్ల శ్రీలక్ష్మీ మాట్లాడుతూ గద్దర్ అంటే తిరుగుబాటు అని, విప్లవగీతాల ప్రస్థానంలో గద్దర్ పాట ఆయుధం కన్నా శక్తివంతమైందని గుర్తు చేశారు. విప్లవ భావజాల వ్యాప్తిలో గద్దర్ గళం ఉత్తేజ పూరిత పాత్రను పోషించిందన్నారు. జననాట్య మండలి వేదికగా విప్లవ శ్రేణుల్లో పోరాట స్ఫూర్తిని నింపిన యుద్ధనౌక గద్దర్ అని, అశ్రు బిందువును అగ్ని కణాన్ని ఇముడ్చుకుంది గద్దర్ పాట అని, పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా..పాటని పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ వి. స్వామి నాయుడు, షేక్ వలీఖాన్, ఈరన్న, శ్రీనివాస్, సంధ్యారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి అనగారిన వర్గాలకు తీరని లోటు

బొబ్బిలి: ప్రజా గాయకుడు, అమరజీవి కామ్రేడ్ గద్దర్ మృతి ప్రజా కళా రంగానికి, అణగారిన వర్గాల ప్రజలకు తీరనిలోటు అని అరుణోదయ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షులు వెలగాడ కృష్ణ అన్నారు. మంగళవారం పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ కామ్రేడ్ గద్దర్ తన పాట ద్వారా పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే వారని గుర్తు చేశారు. హరిజన గిరిజన అనగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై తన పాట ద్వారా ప్రజలను చైతన్యం చేశారని.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు విజయ్‌కుమార్

చీకటి జీవోల సిఎంకు చీకటిగది తప్పదు

మెంటాడ: చీకటి జీవోల ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి చీకటిగది తప్పదని టిడిపి రాష్ట్ర సెక్రటరీ, మండల పరిశీలకులు పుచ్చా విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మెంటాడలో మండలస్థాయి నాయకులతో సమావేశమయ్యారు. జగన్ రెడ్డి పాలనలో ప్రాజెక్టులు దయనీయ స్థితిలో వుండటం వల్ల, రైతుల శ్రేయస్సు కోసం సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్నారని కార్యక్రమం విజయవంతం చేయవలసిన అవసరం వుందని అన్నారు. టిడిపి శ్రేణులు ఆరు నెలలు కష్టపడితే జగన్‌కు గోలీ కట్టే రోజులు దగ్గర పడ్డాయని ఆ తరువాత రాష్ట్రానికి అన్నీ మంచి రోజులు వస్తాయని అన్నారు. దుర్మార్గపు ముఖ్య మంత్రి జగన్ కేబినెట్‌లో భూతుల మంత్రులు, రింగులు తిప్పుతున్న రోజా, నేరచరిత్ర, అవినీతి మంత్రులు వుండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న ఖర్మ అని అన్నారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకట రావు, జి.అన్నవరం, రెడ్డి ఏర్నాయుడు, కుంచు వెంకటి, మనిపూరి రామ చంద్రుడు, రామ లింగేశ్వర రావు, తాడ్డి తిరుపతి, కాశీ విశ్వనాధం, కె.చిన్నం నాయుడు, పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

గంజాయితో విద్యార్థి పట్టివేత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ గ్రామ జంక్షన్ వద్ద పారంపేట గ్రామానికి చెందిన వీరఘట్టపు రాంబాబు అనే విద్యార్థి మంగళవారం గంజాయితో పట్టుబడ్డాడు. ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 1.5 కేజీల గంజాయితో పట్టుబడటంతో అతన్ని అరెస్టు చేశారు. మండలంలోని గడ్డి ముడిదాం గ్రామానికి చెందిన వెంకటేష్ దగ్గర గంజాయిని రాంబాబు కొనుగోలు చేసి పారంపేట బైక్ పైన తీసుకు వెళ్తున్నట్లు పోలీసులకు తెలిపారు. ఈ గంజాయి కేసుకు సంబంధించి రాజాం సిఐ ఉపేంద్రరావు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాంబాబు ఆర్థిక పరిస్థితులు బాగోకపోవడంతో ఇటువంటివి అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు అమ్మకాలు, విక్రయాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కేసును పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అసలైన బాధ్యులను పట్టుకుని గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. వీరితోపాటు పోలీస్ సిబ్బంది శివ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

కొడుకుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- వేపాడ

కొత్త బొద్దాం సమీపంలోని విశాఖపట్నం నుండి అరకు వెళ్లే ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొద్దాం గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమాంబి(40) మృతి చెందారు. ఆమె కొడుకు మహమ్మద్ అక్తార్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. ఇమాంబి తన కొడుకుతో కలిసి ఎస్ కోట తన బంధువులు ఇంటి వద్దకు బైక్ పై వెళ్లి వస్తున్న సమయంలో కొత్త బొద్దాం గ్రామ సమీపంలో బైక్‌కు కుక్క అడ్డంగా రావడంతో అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మరణించింది. బైక్ నడుపుతున్న ఆమె కుమారుడుకు గాయాలయ్యాయి. మరణించిన ఇమాంబి మృతదేహాన్ని ఎస్ కోట ప్రభుత్వాసుపత్రికి పోస్ట్ మాస్టర్ నిమిత్తం తరలించారు.



మృతి చెందిన ఇమాంబి